క్లుప్తంగా

ఘనంగా సాయి విగ్రహ ప్రతిష్ఠ



సాయినాథుని విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: మండలంలోని మరికి పంచాయతీలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి మందిరం ప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. సాయి నాథుని విగ్రహానికి పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు..

సాలూరు: మెంటాడ మండలంలో కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మెంటాడ ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఎంతో అభిమానంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక రత్నాకర్, ఈశ్వరరావు, త్రినాథ, అచ్యుతరావు, రామారావు, తదితరులున్నారు.

ఎర్రసామంతవలసలో వైద్యశిబిరం



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ, జనరల్ మెడిసన్, ఆర్థోపెడిక్, ఆప్తాలమిస్ట్, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన వైద్యులు సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో కొంతమందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి పుష్పనాథం, సర్పంచ్ సీదరపు గంగమ్మ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు అందిస్తున్న విద్యా సామగ్రి

సాలూరు: మండలంలోని శివరాంపురం ప్రాథమిక, జెడ్పీహెచ్ పాఠశాలల విద్యార్థులకు విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ ప్రతినిధి సురకాసి రవితేజ శనివారం విద్యాసామగ్రి పంపిణీచేశారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, సర్పంచ్ మోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వాటర్‌బాటిళ్లు, తదితర సామాన్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఉమామహేశ్వరరావు, ప్రమీల, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వీఎస్ఎస్ అటవీ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ కాలేజ్ సమీపంలో ఖాళీగా ఉన్న వనసంరక్షణ సమితి అట వీ భూముల్లో స్థానికులకు నివాస స్థలాలు మంజూ రు చేయాలని సీపీఎం, గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, సన్యాసిరావు, అగ్గన్న తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జే.కే.పాడు, ఎస్.కే.పాడు, ఎల్విన్‌పేట గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు ఖాళీగా ఉన్న వీఎస్ఎస్ అటవీ స్థలం వద్దకు చేరుకొని, అక్కడి తుప్పలు, పొదలను తొలగించారు. ఆ స్థలం ఎల్విన్‌పేట అటవీశాఖ బీట్‌లోని జే.కే.పాడు, ఎస్.కే.పాడు గ్రామాలకు చెందిన వన సంరక్షణ సమితిల కు 1995లోనే ప్రభుత్వం అప్పగించిందని, తామంతా నిరుపేదలేనని, ఆ స్థలంపై పూర్తి హక్కులు స్థానికులైన తమకే ఉందని, సంబంధిత అధికారులు స్పందించి స్థానికులైన తమకే నివాస స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారికి సీపీఎం నాయకులు మద్దతుగా నిలిచారు.

ముగిసిన సమగ్ర ఓటరు సర్వే

- ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీసిన బీఎల్ఓలు
- శత శాతం పరిశీలన పూర్తి
- ప్రారంభమైన పోలింగ్‌స్టేషన్ల క్రమబద్ధీకరణ
- మార్పులు, చేర్పులు, ఓటరు నమోదుకు 12,480 దరఖాస్తులు



పార్వతీపురం మండలం ఎమ్మార్ నగరంలో సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: తప్పుల్లేని స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఓటరు సంక్షిప్త సవరణ – 2024 కార్యక్రమాన్ని జిల్లాలో 35 రోజులు నిర్వహించారు. ఇంటింటి సర్వేలో భాగంగా జూలై 21 నుంచి ఆగస్టు 25 వరకూ బీఎల్ఎలు ప్రతి గడపకూ వెళ్లారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి వివరాలు సేకరించారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపుతో పాటు శాశ్వత వలసదారులను గుర్తించి వారికి సమాచారం ఇచ్చి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు ఇలా ప్రతిదానికీ దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఈఆర్డీఓలు, ఏఈఆర్డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు.

శత శాతం పరిశీలన పూర్తి

స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించడంతో పాటు ఇదే అంశంపై పలుమార్లు సమీక్షించారు. ఈ క్రమంలో బీఎల్ఓలు 35 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి శత శాతం కుటుంబాలను సర్వే చేశారు. యువ ఓటర్లు నమోదుకు ఫారం – 6, ఓటర్ల తొలగింపు వివాహమై మరో చోటకు వెళ్లిన వారు అక్కడ ఓటు చేర్చడానికి ఫారం – 7, తప్పులు సవరణకు ఫారం – 8 స్వీకరించారు. అలాగే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారిని నూతన ఓటర్లుగా గుర్తించి ఫారం – 6 తీసుకున్నారు.

రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో..

ఎన్నికల సంఘం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను (ఆర్డీఓ) నియమించింది. దీంతో వారు ఇంటింటి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు బీఎల్ఓల నుంచి తెప్పించుకుని పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఓటరు జాబితాకు సంబంధించి పూర్తి బాధ్యతలను ఈఆర్డీలకు అప్పగించి పర్యవేక్షించారు.

ప్రారంభమైన పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ

ఎన్నికల కమిషన్ పోలింగ్ స్టేషన్ క్రమబద్ధీకరణపై కూడా దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు బుధవారం నుంచి సెప్టెంబర్ 29 వరకూ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా ఎపిక్ కార్డులు, ఎలక్ట్రోరల్ రోల్ నంబర్ల మధ్య వ్యత్యాసాన్ని సరి చేయడం, ఓటర్ల తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పోలింగ్ స్టేషన్ల సరిహద్దులు గుర్తించడం, మౌలిక వసతులైన విద్యుత్, ర్యాంప్ నిర్మాణం తదితరాలను పరిశీలించనున్నారు.

శత శాతం పూర్తి



స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే జిల్లాలో శత శాతం పూర్తి చేశాం. ఇందులో భాగంగా అధికారులు బుధవారం నుంచి సెప్టెంబర్ 29 వరకూ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకున్న బూత్ లెవల్ అసిస్టెంట్లు, బీఎల్ఓల సమన్వయంతో ఇంటింటి సర్వే విజయవంతం చేశాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

జిల్లాలో సమగ్ర సర్వే ఇలా..

నియోజకవర్గం	పోలింగ్‌స్టేషన్ల సంఖ్య	మొత్తం ఓటర్లు	మొత్తం ఇళ్లు	పరిశీలించిన ఇళ్లు	పరిశీలించిన ఓటర్లు
పాలకొండ	283	198347	81414	81414	198347
కురుపాం	268	186610	67998	67998	186610
పార్వతీపురం	233	187815	57618	57618	187815
సాలూరు	240	197817	67296	67296	197817
మొత్తం	1024	770589	274326	274326	770589

కొత్తగా నమోదు ఇలా..

నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-8
పాలకొండ	4406	6602	17442
కురుపాం	4550	2978	18791
పార్వతీపురం	1119	793	8483
సాలూరు	2405	1894	13235
మొత్తం	12480	12267	57951

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల పురపాలక సంఘంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో భాగంగా 24వ వార్డు కంకట వీధిలో శిథిలావస్థకు చేరుకున్న కాలువలు, రోడ్డు స్థానంలో నూతన సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరుస్తూ అవసరమైన చోట పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేరస్తూ అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం కొత్తగా కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు నిరంతరం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు తాడ్డి అరుణ శంకరరావు, బంగారి నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ సఫి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మజ్జి శేఖర్, భాస్కరరావు, కార్యకర్తలు, స్థానిక వార్డు పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

'గిడుగు'కు ఘన నివాళులు



ఎంఆర్‌సీ వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ సామల, సిబ్బంది

బలిజిపేట: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామూర్తి జయంతి సందర్భంగా బలిజిపేట ఎంఆర్‌సీ వద్ద ఎంఈఓ–1 సామల సింహాచలం గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవహారిక భాషా ఉద్యమానికి మూల పురుషుడు గిడుగు రామూర్తి అని తెలిపారు. సంఘ సంస్కర్తగా, చరిత్రకారునిగా మంచి పేరు సంపాదించారన్నారు. సవర భాషా అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. గిడుగు జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్డీఏ భద్ర, సీఎంఆర్టీలు ఝాన్సీ, సుభాషిణి, శ్రీరామ్, వైకుంఠరావులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై దృష్టి సారించండి

- డీఐఓ జగన్మోహనరావు



వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

మక్కువ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీల్లో) సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన శంబర, మక్కువ పీహెచ్‌సీలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు ఏ మేరకు జరుగుతున్నాయో ఆరా తీశారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ప్రసూతి గదులను (లేబర్ రూమ్) పరిశీలించి, డెలివరీ సమయంలో ఉపయోగిస్తున్న పరికరాలు, అత్యవసర మందులు, ఆక్సిజన్ సదుపాయం వాటి నిర్వహణ, తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల్లో నెలవారీ జరుగుతున్న సాధారణ ప్రసవాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించి గర్భిణులు పీహెచ్‌సీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నూతన పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాక్సిన్ నిల్వలు, మందులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, ఎవీవీ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ సరస్వతి, వెంకటరత్నం, వైద్య సిబ్బంది ఉన్నారు.

వేడుకగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: పట్టణంలో రాయఘడ రహదారి పరిధిలో వున్న శ్రీఆంజనేయ, శ్రీవేంకటేశ్వర స్వామి, గోదా రంగనాథ ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణం వేడుకగా నిర్వహించారు. పవిత్ర శ్రావణ మాసం కావడంతో శ్రీ ఆంజనేయస్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామివారికి అర్చకులు కుమారభట్టర్ గోపినాథాచార్యులు వివిధ గ్రామాల నుండి వచ్చిన దంపతులచే అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం..

సాలూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయానికి సంబంధించి నూతనంగా ఏర్పాటైన కార్యవర్గం శనివారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా తాడి హరినాథరావు, ఉపాధ్యక్షుడు ఉప్పల మోహనరావు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

సీతంపేట: ఎస్టీ బోగస్ కులధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై వచ్చిన ఫిర్యాదులపై ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శనివారం విచారణ జరిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. 3 కేసులకు సంబంధించి మరిన్ని ఆధారాలు తీసుకురావాలని సూచించారు. ఏపీఓ రోసిరెడ్డి, డీడీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్ పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని మరిపవలస, బక్కుపేట రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే పనులను తహసీల్దార్ ఎన్వీ రమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేతో భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు ఉండవన్నారు. రీసర్వేకు సంబంధిత భూ యజమానులైన రైతులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. పట్టణంలో 16వ వార్డు పల్లవీధికి చెందిన కుదిగాన ధనుంజయ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని ఎమ్మెల్యే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా.. సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుని భార్య మహాలక్ష్మికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కడగల రమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు బాసూరు కాంతారావు, నీలాపు శ్రీనివాసరావు, కోడెం విజయ్‌కుమార్, పార్టీ నాయకులు టేకు రామకృష్ణ, సత్యనారాయణ, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి గోపీకృష్ణ

సీతానగరం: మండలంలోని శ్రీవేంకటేశ్వర మత్స్యశాఖ సహకార సంఘం పాలకవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగిందని ఎన్నికల అధికారి(పాలకొండ ఫిషరీస్ ఏడీ) డి.గోపికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బూర్జ శ్రీవేంకటేశ్వర ఫిషరీస్ సహకార సంఘం పాలకవర్గం గడువు ముగియడంతో నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో బూర్జలో అధ్యక్షుడు గలగట్ల సింహాచలం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించామన్నారు. సంఘం అధ్యక్షుడిగా గలగట్ల సింహాచలం, ఉపాధ్యక్షుడుగా గొర్లె ధనంజయ్, పాలకవర్గ సభ్యులుగా జి.గంగులు (సంగమేశ్వరరావు), కోటిపిల్లి శంకరరావు, గంటా రాము, ఎస్.అప్పయ్య, గుగ్గరపు పకీరు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డబీంబరు గోపీకృష్ణ తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులంతా పాత పాలకవర్గానికి వీడ్కోలు పలికి నూతన పాలకవర్గం సభ్యులకు అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారీ



గెడ్డలుప్పిలో దోమల నివారణ మందు పిచికారీ

సీతానగరం: మండలంలోని వర్షాలు కురుస్తున్న కారణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు పలు గ్రామాల్లో శనివారం గ్రామ సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించి దోమలు నివారణకు మందులు పిచికారీ చేయించారు. ఈ మేరకు గెడ్డలుప్పిలో సర్పంచ్ అల్లు తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యదర్శి మోహనరావు గ్రామంలో కాలువలో పూడికలు తీయించి పారిశుద్ధ్య పనులు నిర్వహించిన అనంతరం దోమలు నివారణకు మందు ద్రావణాన్ని పిచికారీ చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. పెదబోగిలిలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరావు దోమలు నివారణకు ఫాగింగ్ చేయించారు. ఆర్అండ్‌బీ రోడ్డుపై మార్కెట్‌లో ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేయించి రోడ్డుపై ఉన్న మురుగు నీరును మళ్లింపు చర్యలు చేపట్టారు. రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న చినబోగిలిలో సర్పంచ్ కురమాన రాధ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు రోడ్డుకు ఇరువైపులా పేరుకు పోయిన చెత్తను తొలగించి దోమలు నివారణ మందును పిచికారీ చేశారు. కుళాయిల చుట్టూ ఉన్న చెత్తకుప్పలను తొలగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుదీకరణ పనులు



కాశీపేటలో రాష్ట్ర రహదారి వద్ద జరుగుతున్న విద్యుదీకరణ పనులు పరిశీలిస్తున్న ఏఈ సోమేశ్వరరావు

సీతానగరం: మండలంలోని రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా రోడ్డు ప్రమాదాల నివారణకు, అమృత్ సరోవర్ చెరువుల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల వద్ద విద్యుద్దీకరణ పనులు చేయడం జరుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు అన్నారు. కాశీపేట వద్ద జరుగుతున్న విద్యుద్దీకరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న రోడ్డుకు ఇరువైపులా గతంలో వేసిన స్తంభాలు చిన్నవి కావడంతో ఓవర్‌లోడ్ లారీలకు తగులుతుండడం, భారీ వాహనాలు తిరుగుతుండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్త చర్యగా లచ్చయ్యపేట రోడ్డు నుండి సూరంపేట జంక్షన్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేయడం, వైర్లు మార్పు చేస్తున్నట్టు జరుగుతోందన్నారు. ప్రభుత్వం గుర్తించిన అమృత్ సరోవర్ చెరువు గట్లపై ఉన్న చిన్న స్తంభాలను మార్పు చేసి విద్యుత్ స్తంభాలు మార్పు చేస్తున్నట్టు తెలిపారు. గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధమవుతున్న జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేస్తున్నామని ఏఈ సోమేశ్వరరావు అన్నారు. వారి వెంట విద్యుత్ శాఖ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మేన్‌లు, జేఎల్ఎంలు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని పార్వతీపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. నో యాక్సిడెంట్ డే సందర్భంగా పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రతా నియమావళిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆటో డ్రైవర్‌లు ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా, వారిపై అమర్యాదగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. ఓవర్‌లోడ్ ఎక్కించరాదని ధనాపేక్షతో కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లేకుంటే చట్టపరంగా అపరాధ రుసుం విధిస్తామని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. వివిధ మార్గాల్లో సంచరించే ఆటోల వివరాలను ఆయా స్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సులో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా అడుగులు



టైలరింగ్ ధ్రువపత్రాలు అందజేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మదర్ థెరిసా జయంత్యుత్సవ వేడుకల్లో భాగంగా శనివారం టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు టైలరింగ్ శిక్షణ పొందిన 55 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా అభ్యుదయ ప్రభుత్వమని అన్ని విధాలుగా మహిళలకు అండగా ఉంటుందన్నారు.

మహిళలు సమాజంలో గౌరవంగా జీవించేందుకు స్వతహాగా జీవనోపాధి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆసరా, చేయూత, చేదోడు వంటి కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎల్టీసీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.